- జన ప్రవాహాన్ని చూస్తేనే బంపర్ మెజార్టీతో గెలుస్తడని తెలిపోయింది..
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భా వం కాకపోతే నిర్మల్ జిల్లా అయ్యేదా..
- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించండి..
- నిర్మల్ నియోజకవర్గ 'ప్రజా ఆశీర్వాద సభ'లో ముఖ్యమంత్రి కేసీఆర్

# 'అల్లోల'ను దీవించండి..

మంచిర్యాల, నవంబర్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిర్మల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని దీవించి, మళ్లీ గెలిపించారని బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం, తెలంగాణ హక్కులు కాపాడడానికి.. నీళ్లు, నిధులు, నియామకాల కోసమని ఉద్ఘాటించారు. తెలంగాణ ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం వాటిల్లకుండా ఉండాలనుకునే కాపాలా దారే బీఆర్ఎస్ పార్టీ అని స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లాలోని కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో క్రశ్కర్ ఏరియాలో నిర్వహించిన నిర్మల్ నియోజకవర్గ 'ప్రజా ఆశీర్వాద సభ'లో సీఎం కేసీఆర్ మాట్లాడారు. నిర్మల్ నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు రెండు సార్లు బీఆర్ఎస్‌ను ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రమే రాకపోతే.. నిర్మల్ జిల్లా అయ్యేదా.. దయచేసి ఆలోచించాలని సూచించారు. నిర్మల్ జిల్లా చేసింది నేను కావచ్చు కానీ.. నాకంటే ఎక్కువ తపనపడి జిల్లా చేయించింది మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అని చెప్పారు. మేం హైదరాబాద్‌లో కూర్చొని ఆదిలాబాద్‌లో కొత్త జిల్లాలు ఏం ఏర్పాటు చేద్దామని ఆలోచిస్తుండగా.. అటో జిల్లా, ఇటో జిల్లా రెండు జిల్లాలు చేస్తే సరిపోతదని, ఆదిలాబాద్ ఎట్లా ఉంది, మంచిర్యాల ఒకటి చేస్తే సరిపోతదనే నిర్ణయానికి వచ్చామన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్

### ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ జిల్లా కావాలన్నడు..

అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఒక బృందాన్ని తీసుకొని బయటికి వెళ్లి, మళ్లీ ఒక గంట తరువాత వచ్చి సార్ ఇది మీ వల్లనే కావాలే.. ఇంకెవరితోని కాదు.. ఆదిలాబాద్ జిల్లా రాష్ట్ర రాజధానికి చాలా దూరమున్న జిల్లా. చాలా అడవులు ఉన్న జిల్లా. వేరే ఎవరికి దమ్ములేదు.. ఎవరూ చేయరు.. మీకే తెలుసు బాసర నుంచి ఆదిలాబాద్ పోవాలంటే ఎంత దూరమో.. బెజ్జూర్ నుంచి ఆదిలాబాద్ రావాలంటే ఎంత దూరమో.. అందుకే ఏం చేసైనా సరే నాలుగు జిల్లాలు చేయాలని అడిగారన్నారు. కచ్చితంగా నిర్మల్ జిల్లా కావాలని, రెండోది ఆదిలాబాద్ ఎట్లాగు ఉంటుంది ఇగ మారుమూల ప్రాంతాలైన ఆసిఫాబాద్, మంచిర్యాలలు జిల్లాలు కావాలని పట్టుపట్టి, మీరు ఏం చేసినా సరే నాలుగు జిల్లాలు చేయాలని చెప్పి గంటసేపు నాతో వాదించి.. ఈ నాలుగు జిల్లాలు అయ్యేట్లు చేసిన వ్యక్తే ఇంద్రకరణ్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ఇవాళ నిర్మల్‌లో మీరు ఎంత సంతోషంగా ఉన్నారో, అక్కడ వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉన్నారని, ఆసిఫాబాద్, మంచిర్యాలలను జిల్లాలు చేసినందుకు చేతులెత్తి దండం పెడతా ఉన్నారని పేర్కొన్నారు.

### 4 మెడికల్ కాలేజీలు వస్తయనుకున్నమా..

మారుమూల ఉన్న ఈ నాలుగు జిల్లాలకు ఇవాళ బ్రహ్మాండంగా నాలుగు మెడికల్ కాలేజీలు వచ్చాయన్నారు. ఏ రోజైనా అనుకున్నామా.. నిర్మల్‌కు మెడికల్ కాలేజీ వస్తదని, ఎన్నడన్న ఊహించినమా ఆలోచించాలన్నారు. మీ ఇంద్రకరణ్‌రెడ్డి చాలా హుషారుగా ఉన్నడని.. ముందు జిల్లా చేస్తే చాలు సర్ ఏం అడుగా అనిచెప్పి ఒక్కొక్కటి అన్ని అడుగుతున్నారంటూ సీఎం కేసీఆర్ చమత్కరించారు. జిల్లా అయ్యింది. మెడికల్ కాలేజీ అయ్యింది. ఇవాళ అడుగుతాడని నేను అనుకోలే కానీ ఇంజినీరింగ్ కాలేజీ కావాలని అడిగారన్నారు. మంచి నాయకుడు తను పుట్టిన ప్రాంతం మీద ప్రేమ ఉన్నది కాబట్టి డెవలప్ చేసుకోవాలని అడుగుతున్నారన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి ఎలక్షన్‌ల గెలిచి పోయిండని ఈ సభనే చెప్తుందన్నారు. దాంట్లో ఎలాంటి డౌటే లేదన్నారు. ఇవాళ సభలోనే రిజల్ట్ ఔటై పోయిందన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి ఎంత సౌమ్యుడో, ఎంత మంచి మనిషో నేను మీకు చెప్పాల్సిన అవసరం లేదని, ప్రజల కోసం ఎంత తండ్లాడుతాడో మీకు తెలుసన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఇవాళ నిర్మల్ పట్టణం, నిర్మల్ జిల్లా ఎంత బాగా అభివృద్ధి చెందాయో నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మంచినీళ్లు, సాగు నీరు ఏ విధంగా ఆయన తపన పడి తెస్తున్నరో మీ అందరికీ తెలుసునన్నారు. ఇంజినీరింగ్ కాలేజీ పెద్ద విషయం కాదని, ఈసారి ఎన్నికల్లో ఇంద్రకరణ్‌రెడ్డికి 70 వేలు, 80 వేలు మెజార్టీ వస్తే డెఫినెట్‌గా జేఎన్‌టీయూ నుంచి ఇంజినీరింగ్ కాలేజీ ఇప్పించే బాధ్యత నాది అని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

### కరెంట్ బాగు చేసుకున్నాం..
### తండాలను పంచాయతీలు మార్చుకున్నాం..

ఇక్కడ మా వేణుగోపాలాచారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒక ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే, ఒక సబ్‌స్టేషన్ కావాలంటే, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఏ విధంగా లంచాలు పెట్టినమో.. ఎట్లా మునిగినమో రైతులందరికీ తెలుసునన్నారు. కరెంట్ లేకుండేనని, చాలా ఘోరమైన పరిస్థితి ఉండేనని చెప్పారు. ఈ రోజు కరెంట్‌ను బాగు చేసుకున్నామన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి ఒక్కరే 15 సబ్‌స్టేషన్లు నియోజకవర్గంలో కట్టించుకున్నారన్నారు. ఒక నిర్మల్ నియోజకవర్గంలో ఒకటే టర్మ్‌లో 15 సబ్‌స్టేషన్లు తెచ్చారని, ఎక్కడ అవసరమైతే అక్కడ కట్టుకున్నారని చెప్పారు. ఇక మా గిరిజన బిడ్డలు, లంబాడా బిడ్డలు 'లంబాడ హక్కుల పోరాట సమితి' అని ఎన్నో సంవత్సరాల నుంచి పోరాడుతున్నారన్నారు. 'మా తండాలో మా రాజ్యం' కావాలని, నేను ఆదిలాబాద్ వచ్చినప్పుడు గోండు గూడేలలో 'మావ నాటే.. మావ రాజ్' అని మాట్లాడారన్నారు. ఏ ప్రభుత్వం కూడా చేయలేదని, కనీసం వాళ్లను పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ గవర్నమెంట్‌లో నాలుగు వేల గిరిజన తండాలను, గోండు గూడేలను, ఆదివాసీ గూడేలను ఇండిపెండెంట్ పంచాయతీలుగా చేశామన్నారు. ఇవాళ లంబాడా బిడ్డలందరూ వాళ్ల తండాల్లో వాళ్లే రాజ్యం పరిపాలిస్తున్నారని.. బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు. పోడు పట్టాలు ఇచ్చి 4 లక్షల ఎకరాలు పంచి పెట్టి, రైతుబంధు కూడా ఇచ్చి త్రిఫేజ్ ఉచిత కరెంట్ కూడా ఇస్తున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. నిర్మల్ నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లను ఒక్కటే కోరుతున్నా. పార్టీల చరిత్ర చూసి ఓటేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పార్టీకి ఒక చరిత్ర ఉంటుందని, ఇవాళ మా పార్టీ ఏం చేసిందనేది అంతా మీ కండ్ల ముందు ఉందని చెప్పారు. ఎన్నికలు రాగానే ఆగమై అంతా మర్చిపోవొద్దని ప్రజలు కోరుకున్న, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి, నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు దామోదర్ రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్, బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్, మాజీ మంత్రి, మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలాచారి, నిర్మల్ జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.సత్యనారాయణగౌడ్, స్థానిక ఎంపీపీలు, జడ్పీటీసీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

---

## ప్రత్యేక రాష్ట్రంతోనే
# అభివృద్ధి సాధ్యమైంది

- నిర్మల్ జిల్లాతో పాటు, మెడికల్ కాలేజీ కల సాకారం..
- సాగు నీటి రంగానికి కోట్లాది నిధులు
- ప్రజా ఆశీర్వాద సభలో నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : సీఎం కేసీఆర్ 14 ఏండ్ల పాటు పోరాటం చేసి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం వల్లే ఈ రోజు ఇంతటి అభివృద్ధి సాధ్యమైందని నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్‌లో గురువారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రూపురేఖలు మారిపోయాయన్నారు. ఈ నెల 30న ఎన్నికలు జరుగనున్నాయని, 3వ తేదిన ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మల్‌కు వచ్చి ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనడం అందరి అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అది కూడా యాగం చేసుకొని రావడం శుభ పరిణామమని పేర్కొన్నారు. లోక కళ్యాణం కోసం యాగం నిర్వహించి, ఇక్కడికి రావడంపై నియోజకవర్గ ప్రజలందరి తరపున సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. తెలంగాణ రాకముందు మన బతుకులు ఏ విధంగా ఉండేవో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రం వచ్చాక నిర్మల్ జిల్లా కేంద్రమైందని, మెడికల్ కాలేజీ వచ్చిందని గుర్తుచేశారు. అలాగే రూ.714 కోట్లతో దిలావర్‌పూర్ మండలంలో శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించుకున్నామని, దీంతో నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలకు సాగునీరందుతున్నదని వివరించారు. అలాగే సోన్ మండలం పాక్‌పట్ల వద్ద రూ.300 కోట్లతో పామాయిల్ పరిశ్రమకు ఇటీవలే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్నామని గుర్తుచేశారు. ఈ పరిశ్రమతో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. నిర్మల్ మున్సిపాలిటీతో పాటు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా సాగు, తాగు నీటి రంగంతో పాటు, కరెంటు విషయంలో ప్రజలు ఎదుర్కొన్న ప్రతీ సమస్యను పరిష్కరించామన్నారు. సీఎం కేసీఆర్‌కు నిర్మల్ అంటే చాలా ప్రేమ, అభిమానం ఉన్న విషయాన్ని అందరం గుర్తుంచుకోవాలని, అడిగిన వెంటనే కాదనకుండా నిధులిచ్చి నియోజకవర్గాన్ని అన్న రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇంకా రెండు మూడు సమస్యలు ఉన్నాయని, జిల్లా కేంద్రంలో జనాభా లక్షా 50 వేల వరకు పెరిగిన నేపథ్యంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉందని వెల్లడించారు. రాబోయే రోజుల్లో వచ్చేది మన ప్రభుత్వమే కాబట్టి తొందరలోనే అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, అలాగే నిర్మల్ మున్సిపాలిటీకి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.100 కోట్లు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. వీటితోపాటు స్వర్ణ ప్రాజెక్టు కింద రూ.20 కోట్లతో కాలువల లైనింగ్ కోసం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, వాటిని కూడా మంజూరు చేయాలన్నారు. ఈ లైనింగ్ పనులు పూర్తయితే సారంగాపూర్ మండలంలోని దాదాపు 15 వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

అలాగే ఎస్సారెస్పీ ముంపునకు గురైన దిలావర్‌పూర్, బన్సపెల్లి, లోలం, కంజర్ గ్రామాలకు సాగు నీరందించేందుకు గతంలో గోదావరి నుంచి ఎత్తిపోతల పథకం ఉన్నప్పటికీ, అది చెడిపోయి చాలా కాలంగా పనిచేయడం లేదన్నారు. పాత పైప్‌లైన్ స్థానంలో కొత్తది మారిస్తే ఆయా గ్రామాల వ్యవసాయ భూములకు మళ్లీ సాగునీరందించవచ్చని పేర్కొన్నారు. ఇందుకు రూ.90 కోట్ల వరకు అవసరమవుతాయని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న నిర్మల్‌కు జేఎన్టీయూ అనుబంధంగా ఒక ఇంజినీరింగ్ కాలేజీని మంజూరు చేయాలని కోరారు. ఇటీవల నిర్మల్ పర్యటనకు వచ్చిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు ఇక్కడ ఐటీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అలాగే నిర్మల్ పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నిర్మల్ నియోజకవర్గం సీఎం సహకారం వల్ల అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే కోట్లాది రూపాయల ని ధులు మంజూరు చేసిందని చెప్పారు. నిర్మల్‌లో మ సీదుల నిర్మాణం కోసం రూ.3.5 కోట్లు ఇచ్చామని, షాదీఖాన కోసం రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ మైనారిటీ బంధును అందజేస్తామన్నారు. క్రిస్టియన్లకు రూ.2 కోట్లు ఇచ్చామని తెలిపారు. ఇలా అన్ని వర్గాలకు మేలు చేసేది ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇలాగే కొనసాగాలంటే ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేయాలని ఈ సందర్భంగా ప్రజలను ఆయన కోరారు.

### ఆప్యాయంగా పలుకరిస్తూ

- ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి కోడలు అల్లోల దివ్యారెడ్డి

నిర్మల్ అర్బన్, నవంబర్ 2 : నిర్మల్ పట్టణంలోని ఎల్లపెల్లి క్రషర్ వద్ద గురువారం ప్రజా ఆశీర్వాద సభకు నిర్మల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మహిళలు, యువతులు, యువకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే తండోపతండాలుగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కొన్ని నిమిషాల్లోనే అంతా నిండిపోయింది. యువ నాయకురాలు, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కోడలు అల్లోల దివ్యారెడ్డి సభా ప్రాంగణంలోని అన్ని గ్యాలరీలోల కూర్చున్న బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, యువతులను కలిశారు. ఆప్యాయంగా పలుకరించి, కారు గుర్తుకు ఓటు వేసి ఇంద్రకరణ్ రెడ్డిని ఎమ్మెల్యేగా, కేసీఆర్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ఆమె వెంట అల్లోల శిరీషా రెడ్డి తదితరులున్నారు.





**WANTED**




★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

**BUSINESS OFFER**



★ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న *బయోడిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468.
NT-320324-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

